సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



మల్చింగ్‌తో అధిక దిగుబడులు

మెట్ట పంటల సాగులో రైతులు మల్చింగ్ విధానాన్ని అవలంబిస్తున్నారు. అధిక దిగుబడులు సాధిస్తున్నారు. 8లో



వైభవంగా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం ఇలవేల్పు బలుసులమ్మవారి దసరా ఉత్సవాలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 8లో



సప్త నదీ జలాభిషేకాలు

కాళ్లకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి సప్త నదీ జలాభిషేకాలు నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

రాట్నాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



బారులు తీరిన భక్తులు

పెదవేగి: రాట్నాల కుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఒక్కరోజు పూజా టికెట్లపై రూ.44,910, విరాళాల రూపంలో రూ.14,468, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.30,000, ఫొటోల అమ్మకం ద్వారా రూ.2,100 మొత్తంగా రూ.91,478 ఆదాయం లభించినట్టు దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఎన్. సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక చింతలపాటి బాపిరాజు హైస్కూల్ ఆవరణలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శ్రీరామ్, డీఎన్నార్ కాలేజ్ అసోసియేషన్ కరస్పాండెంట్ కూనపరాజు రామకృష్ణంరాజు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విలీన విద్యావనరుల సమన్వయకర్త సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండల స్థాయిలో విజేతలైన దివ్యాంగ విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న పిల్లలకు ఆకివీడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీ షర్ట్స్ అందజేశారు. జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ ఎ.రామకోటేశ్వరరావు, ఏఎస్ఓ వై.శ్రీనివాస్, విలీన విద్య సహాయ కో-ఆర్డినేటర్ టి.శ్రీనివాస్, డిసేబుల్ వెల్ఫేర్ ఏడీ ప్రభాకర్, వివిధ మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


10న జిల్లా సదస్సు

పాలకొల్లు అర్బన్ : పశ్చిమగోదావరి జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా సదస్సును అత్తిలి టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 10న నిర్వహించనున్నట్టు సంఘ మాజీ అధ్యక్షుడు ఉప్పలపు దుర్గాపెద్దిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఏడు నియోజకవర్గాల నాయీబ్రాహ్మణులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్ష

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు చెందిన 269 మంది దరఖాస్తు చేసుకోగా 260 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. పోస్టల్ సూపరింటెండెంట్ ఏవీఎస్ నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రతాప్ పరీక్షలను పర్యవేక్షించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 40 మంది విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున స్కాలర్‌షిప్ కింద ఏడాది పాటు అందిస్తారన్నారు.

నేడు ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ఆర్ఆర్‌పేటలో సోమవారం ఎస్ఆర్ షాపింగ్ మాల్ శాఖను ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సినీ నటి నేహా శెట్టి, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి తదితరులు తమ బ్రాంచ్‌ను ప్రారంభిస్తారన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శివకేశవరెడ్డి పాల్గొన్నారు.



కొయ్యే మోషేన్‌రాజు, శాసనమండలి చైర్మన్



కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి



కారుమూరి నాగేశ్వరరావు, మంత్రి



ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్



గ్రంధి శ్రీనివాస్, ప్రభుత్వ విప్



వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

పదవుల్లో అగ్రాసనం

భీమవరం(ప్రకాశం చౌక్) : గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలిచిన పశ్చిమగోదావరి జిల్లాపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సంక్షేమం, అభివృద్ధి పనులతో పాటు రాజకీయ, సామాజిక న్యాయం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. ఇలా జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. మొత్తంగా 13 మంది నేతలకు రాష్ట్రస్థాయి పదవులు అప్పగించారు. అత్యున్నతమైన శాసనమండలి చైర్మన్, డిప్యూటీ సీఎం, ప్రభుత్వ చీఫ్ విప్ నుంచి ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో జిల్లా నాయకులు సేవలందిస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి చైర్మన్‌గా ప్రభుత్వ విప్ పదవిని కేటాయించారు.

'పశ్చిమ'కు పెద్దపీట

- కీలక పదవుల్లో జిల్లా నేతలు
- తాజాగా విప్‌గా గ్రంధికి అవకాశం
- మొత్తంగా 13 రాష్ట్రస్థాయి పదవులు
- సంక్షేమంతో పాటు సామాజిక న్యాయం



మండలి చైర్మన్.. ఇద్దరు మంత్రులు

జిల్లాకు చెందిన దళిత నేత కొయ్యే మోషేన్‌రాజును తొలుత ఎమ్మెల్సీగా ఎంపిక చేసి తర్వాత శాసన మండలి చైర్మన్‌గా నియమించారు. అలాగే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాకు మూడు మంత్రి పదవులను సీఎం జగన్ కేటాయించారు. జిల్లాల విభజన అనంతరం రెండు మంత్రి పదవులు కొనసాగుతున్నాయి. తొలుత జిల్లా నుంచి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఇద్దరు మంత్రులుగా పనిచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా కారుమూరి నాగేశ్వరరావు సేవలందిస్తున్నారు.

చీఫ్ విప్.. ఇద్దరు ఎమ్మెల్సీలు

కేబినెట్ హోదా స్థాయి పదవి ప్రభుత్వ చీఫ్ విప్‌గా నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును నియమించారు. అలాగే జిల్లాపరిషత్ చైర్మన్‌గా ఉన్న కవురు శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న వంక రవీంద్రనాథ్‌కు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారు.

తాజాగా విప్

జిల్లాకు పదవుల్లో అన్నింటా న్యాయం చేసిన సీఎం జగన్ మరో అడుగు ముందుకు వేసి భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను శాసనసభ ప్రభుత్వ విప్‌గా నియమించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై పోటీచేసి గెలిచిన గ్రంధి శ్రీనివాస్‌కు రాష్ట్రస్థాయి చైర్మన్ హోదా పదవి ఇవ్వడంతో జిల్లా పేరు రాష్ట్రంలో మరోమారు మార్మోగింది.

టీటీడీ బోర్డు సభ్యులుగా..

ప్రతిష్టాత్మకమైన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గంలో కూడా పశ్చిమగోదావరి జిల్లాకు సముచిత స్థానం దక్కింది. జిల్లాలో పాలకొల్లుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ, మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ మేకా శేషుబాబు, భీమవరం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా పనిచేసిన నిడమర్రు మండలానికి చెందిన గాదిరాజు వెంకట సుబ్బరాజును టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించారు.

కార్పొరేషన్ చైర్మన్లుగా..

పశ్చిమగోదావరి జిల్లాకు ఐదు కార్పొరేషన్ చైర్మన్ పదవులను సీఎం జగన్ కేటాయించి ఇందులోనూ సామాజిక న్యాయం పాటించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా తొలుత మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజును నియమించగా.. ఆయన అకాల మరణంతో ఆయన తనయుడు పాతపాటి శ్రీనివాసరాజు (వాసు)కు ఆ పదవి కట్టబెట్టారు. అలాగే ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా వంక రవీంద్రనాథ్, సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్‌గా పెండ్ర వీరన్న, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్‌గా మేడిది జాన్సన్ సేవలందిస్తున్నారు.

పదవుల్లో న్యాయం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదవుల్లో జిల్లాకు పూర్తి న్యాయం చేశారు. శాసనమండలి చైర్మన్, మంత్రులు, ప్రభుత్వ చీఫ్ విప్, విప్, ఎమ్మెల్సీలు, కార్పొరే**షన్ చైర్మన్లు ఇలా అన్ని పదవు**లు కేటాయించడం **సంతోషం. పదవులు పొందిన** నేతలు జిల్లా ప్రజ**లకు విశేష సేవలు అందిస్తున్నా**రు. ప్రజలకు అం**దుబాటులో ఉంటున్నారు. జిల్లా**కు రాజకీయంగా **గుర్తింపు తీసుకువచ్చిన సీఎం** జగన్‌కు కృతజ్ఞతలు.

– కడలి ధర్మరావు, రాయకుదురు వీరవాసరం మండలం

జిల్లాకు ప్రత్యేక గుర్తింపు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో సంక్షేమాన్ని నూరు శాతం అమలు చేయడంతోపాటు పదవుల్లో కూడా జిల్లాకు పెద్దపీట వేశారు. రాష్ట్రస్థాయి పదవులను జిల్లాలోని నాయకులకు కట్టబెట్టి ప్రజలకు వారి ద్వారా సేవలు అందిస్తున్నారు. జిల్లాకు సంక్షేమం, రాజకీయం రెండింటిలో పూర్తి న్యాయం జరిగింది. రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వస్తోంది.

– చినమిల్లి గణపతిరావు, పాలకొల్లు

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం
- పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వారియర్స్ తమ సత్తాచాటుతూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులోని గోకుల్ కల్యాణ మండపంలో ఆదివారం పార్టీ సోషల్ మీడియా మీట్ అండ్ గ్రీట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం దక్కదనే అక్కసుతో నైతిక విలువలకు తిలోదకాలు ఇస్తూ ప్రతిపక్షాలన్నీ సీఎం జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలిపేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సీఎం జగన్ జనరంజక పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఆరు నెలలు కష్టపడితే మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రి గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఉంటారన్నారు.

ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం

సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సజ్జల భార్గవ్ మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని చెప్పారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని. చిత్రంలో ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, ఎలీజా, వాసుబాబు, బాలరాజు, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సజ్జల భార్గవ్

విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. రాక్షసుడు లాంటి చంద్రబాబును ఎదుర్కొనే సత్తా ముఖ్యమంత్రి జగన్‌కు మాత్రమే ఉందన్నారు. ముందుగా కుటుంబ వ్యవస్థలో అభివృద్ధి ప్రారంభం కావాలనీ అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఎమ్మెల్యేలు, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా కార్యకర్తలకు త్వరలో గుర్తింపు కార్డులు అందజేస్తామనీ, బీమా సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, ఉన్నమట్ల ఎలీజా, తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, కైకలూరు ఎమ్మెల్యే కుమారుడు దూలం శ్యామ్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా వరప్రసాద్, ఏలూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, జిల్లా పార్టీ ఈసీ మెంబర్ పిన్నమనేని మురళీకృష్ణ, జిల్లా కో-కన్వీనర్లు కొప్పుల ప్రభాకర్‌రెడ్డి, సైదం సురేష్, నెక్కంటి వెంకటేష్, ముప్పిడి ప్రసాద్ రెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వైఎస్‌వీ శివరావు, కో-కన్వీనర్ ముల్లంగి వేణురెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సోషల్‌మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వెలమలకు అధిక ప్రాధాన్యం

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి: రాష్ట్రంలో వెలమలకు గుర్తింపు ఇచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. చింతలపూడిలోని వెలమపేట వద్ద వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తాండ్ర పాపారాయుడు విగ్రహాన్ని ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా వెలమలకు అంతగా గుర్తింపు ఇవ్వలేదని అన్నారు. డిప్యూటీ సీఎంతో సహా డీసీసీబీ చైర్మన్లు, జిల్లాపరిషత్ చైర్మన్లతో పాటు పలు నామినేటెడ్ పదవుల్లో సీఎం జగన్ వెలమలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో వెలమలంతా జగన్ వెంట నడవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో సుపరిపాలన

రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని జెడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల్లో వెలమలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక స్థానం గుర్తింపు కల్పించిందన్నారు. వెలమలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలంటే వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసి జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మరడాని రంగారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, పొన్నాల అనిత, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్నేపల్లి అప్పారావు, యు.ఉమామహేశ్వర్రావు, డోకలాము, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



తాండ్ర పాపారాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

అరకొరగా కర్నూలు ఉల్లి

- కర్నూలు నుంచి తక్కువ సంఖ్యలో ఉల్లి లారీలు
- పంట విస్తీర్ణం తగ్గడమే కారణం
- మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్
- ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు



తాడేపల్లిగూడెం: అక్టోబర్ మాసం వచ్చిందంటే తాడేపల్లిగూడెంలో ఉల్లిపాయల సంబరం జరుగుతుందా అనేలా వాతావరణం ఉండేది. జాతీయ రహదారి బైపాస్ నుంచి బాదంపూడి మీదుగా, పెదతాడేపల్లి మీదుగా వందల సంఖ్యలో వాహనాలు బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌కు బారులు తీరేవి. ప్రత్యేకంగా శని, బుధవారాల్లో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటూ ఈ పరిస్థితి జనవరి వరకు కనిపించేది. రాష్ట్రంలో అధికంగా ఉల్లిని పండించే కర్నూలు జిల్లాలోని పంటలో దాదాపు 90 శాతం వరకు తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చేది. ఇది ఈనాటి బంధం కాదు. 70 ఏళ్లకు పైగా ముడిపడిన వ్యాపార అనుబంధం. కోవిడ్ కారణంగా ఈ వ్యాపార బంధంలో ఒడిదుడుకులు ప్రారంభమై.. చివరికి కర్నూలు ఉల్లి అరకొరగా ఇక్కడకు వచ్చే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. అక్కడి ఉల్లి రైతులకు ఇక్కడి వ్యాపారులు పంటకు పెట్టుబడులు సమకూర్చడం, అక్కడ పండిన పంటను ఇక్కడకు మాత్రమే తీసుకొచ్చి విక్రయించే వ్యాపార సంస్కృతి గతంలో ఉండేది. ఇక్కడకు వచ్చిన ఉల్లిని గ్రేడింగ్ చేసి నైలాన్ సంచుల నుంచి గోనె సంచుల్లోకి నాణ్యమైన ఉల్లిని వేసి ఒడిసా, బంగ్లాదేశ్, కోల్‌కత వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. గత నాలుగేళ్లుగా ఈ వాతావరణం మసకబారుతూ వస్తోంది. ఈ ఏడాది కర్నూలు ఉల్లి సీజన్ ప్రారంభమైనా తాడేపల్లిగూడెం మార్కెట్‌లో సందడి ఏమాత్రం లేదు. వ్యాపార బంధాలు, వాతావరణ ఒడిదుడుకులు, మార్కెట్ సంస్కృతి, ధరల ఎత్తుపల్లాలు వంటివి ప్రభావం చూపించిన నేపథ్యంలో కర్నూలు ఉల్లి గూడెం మార్కెట్‌లో అరకొరగా మాత్రమే దర్శనమిస్తోంది.

80 శాతం తగ్గిన పంట విస్తీర్ణం

2019లో వాతావరణ అననుకూల ప్రభావాలు, మార్కెట్ ఒడిదుడుకులు, కోవిడ్ వంటి వాటి కారణాలతో కర్నూలులో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నష్టాలతో కోలుకోలేని స్థితి వచ్చింది. దీంతో ఉల్లి వైపు రైతులు ఆసక్తి తగ్గించారు. ఈ సీజన్‌లో అక్కడ పంట విస్తీర్ణం 80 శాతం మేర తగ్గింది. కేవలం 20 శాతంలో మాత్రమే పంట వేశారు. ఈ పంట చేతికందే సమయానికి వానలు రాకపోవడంతో సరుకు తయారు కాలేదు. చిన్నసైజు ఉల్లిపాయలు మాత్రమే తయారయ్యాయి. కర్నూలు రకంలో నిల్వకు ఆగే గుణం లేకపోవడంతో సరుకుకు ఆశించినంత ధర లభించకపోవడంతో రైతులు ఎగుమతికి విముఖంగా ఉన్నారు. దీంతో కర్నూలు ఉల్లికి మెట్టినిల్లుగా పేరొందిన తాడేపల్లిగూడెం మార్కెట్‌కు సరుకు రాని పరిస్థితి నెలకొంది.

మహారాష్ట్ర ఉల్లి ఒక కారణం

దేశంలోని మార్కెట్లకు ఏడాది పొడవునా ఉల్లిని సరఫరా చేసే శక్తి మహారాష్ట్రలోని రైతులకు ఉంది. వ్యాపారులకు అక్కడ ప్రోత్సాహం, నాబార్డు సాయంతో నిర్మించుకున్న ఓపెన్ స్టోరేజ్ గోదాములు అందుబాటులో ఉండటం, మండీల (మార్కెట్‌ల) పరిస్థితుల కనుగుణంగా సరుకును పంపించే నేర్పరితనం అక్కడి రైతులకు ఉండటంతో వ్యాపారులను శాసించే స్థితిలో ఉండేవారు. ఈ ఏడాది మహారాష్ట్ర ఉల్లి మార్కెట్లలో ఉండటంతో కర్నూలు ఉల్లి కొనేవారు లేరు. నిల్వ ఉండే గుణం మహారాష్ట్ర పాయలకు ఉండటంతో వినియోగదారులు దీనిపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ రకానికి డిమాండ్ కూడా పెరిగింది. ధరలను నియంత్రించే క్రమంలో ఇటీవల కేంద్రం ఉల్లి ఎగుమతులపై 40 శాతం ఎగుమతి సుంకాలను విధించడంతో పాటు బఫర్ స్టాకుల నుంచి ఉల్లిని రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తున్నాయి. దీంతో కర్నూలు ఉల్లికి డిమాండ్ తగ్గింది.

ప్రభుత్వం ఉపశమన చర్యలు

డిమాండ్, సరఫరాకు మధ్య వ్యత్యాసమున్న నేపథ్యంలో కృత్రిమ కొరత, అధిక ధరలను నియంత్రించడానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉపశమన చర్యలు చేపట్టాయి. సుమారు మూడు లక్షల టన్నుల ఉల్లిని నిల్వ చేశాయి. కర్నూలు, మహారాష్ట్రల్లో పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి మార్కెట్లకు పంపిస్తోంది.

ధరల అదుపు

ప్రస్తుత పరిస్థితిలో ఉల్లి కిలో రూ.50 ధర పలకాలి. అయితే ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం గూడెం మార్కెట్‌లో మహారాష్ట్ర రకం ఉల్లి నాణ్యతను బట్టి క్వింటాలు రూ.2,700 నుంచి రూ.2,800 పలికింది. ప్రభుత్వమే కొనుగోలు చేసి మార్కెట్‌కు సరఫరా చేసిన కర్నూలు రకం ఉల్లి క్వింటాలు రూ.1,800 నుంచి రూ.2,200 ఉంది. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.35 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఆదివారం మొత్తం రెండు రకాల ఉల్లిపాయలు కలిసి 20 లారీల సరుకు మాత్రమే గూడెం మార్కెట్‌కు వచ్చింది.

వన దేవతకు వందనం



గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించేందుకు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువ జాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. భక్తులు మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు ఇక్కడకు చేరుకున్నారు. అలాగే మండలంలోని మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువైన పాటిమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



అటవీ ప్రాంతంలో వాహనాలు

క్లుప్తంగా

పశువుల అక్రమ తరలింపుపై కేసు నమోదు



తెలంగాణకు తరలిస్తున్న పశువులు

టి.నరసాపురం: శ్రీకాకుళం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న పశువులను మక్కినవారిగూడెంలో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీకాకుళం జిల్లా నరసన్న పేట సంత నుంచి గోవింద్, యోగేంద్ర మరో ఇద్దరు వాటిని కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లోని తుక్కగూడ కబేళాకు తరలిస్తుండగా పట్టుకున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న 28 పశువులను హనుమాన్‌జంక్షన్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై సురేంద్రకుమార్ తెలిపారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి రిమాండ్

వీరవాసరం: బాలికపై అత్యాచారం కేసులో ఒక వ్యక్తికి రిమాండ్ విధించినట్లు స్థానిక ఎస్సై పి.రమేష్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న వీరవాసరం గ్రామానికి చెందిన రాపాక సురేష్ అదే గ్రామానికి చెందిన ఒక బాలిక ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అత్యాచారం చేశాడని బాలిక అమ్మమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ రవి ప్రకాష్, దిశా చట్టం డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేశామని, నిందితుడు సురేష్‌ను భీమవరం కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ రమేష్ తెలిపారు.

వేధింపులు తట్టుకోలేక ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నం



ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు

లింగపాలెం: లింగపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణి వేధింపులు తట్టుకోలేక ఏఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏఎన్ఎం చోడగిరి శర్వాణి ఆదివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్ వైఖరిని నిరసిస్తూ హాస్పటల్ వద్ద ఏఎన్ఎంలు ఆందోళన చేశారు. తనపై శర్వాణి చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు.

మల్చింగ్‌తో అధిక దిగుబడులు

- మల్చింగ్ సాగులో అధిక దిగుబడులు
- 50 శాతం రాయితీ అందిస్తున్న ప్రభుత్వం



మల్చింగ్ విధానంలో బొప్పాయి సాగు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



మెట్ట ప్రాంతంలో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న మిర్చి పంట

చింతలపూడి: మెట్ట పంటల సాగులో ప్రస్తుతం రైతులు నూతన వ్యవసాయ సాగు పద్ధతులను అవలంభిస్తున్నారు. అన్ని ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పంటలను కాపాడుకునేందుకు వీలుగా మల్చింగ్ సాగు విధానం ఎంతో ఉపయోగపడుతుంది. తక్కువ నీటి వసతులతో ఎక్కువ పంట సాగు చేసి అధిక లాభాలు పొందేందుకు రైతులు మల్చింగ్ వైపు దృష్టి సారిస్తున్నారు. మొక్కల చుట్టూ ఉన్న మొత్తం ప్రాంతాన్ని ప్లాస్టిక్ కవర్లతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ విధానం అంటారు. ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలోని ఉద్యాన సాగులో మల్చింగ్ విధానం రైతులకు వరంలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మల్చింగ్ సాగు పద్ధతికి 50 శాతం సబ్సిడీ అందిస్తుండటంతో రైతులు దీనిపై ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. మల్చింగ్ సాగులో కలుపు నివారణ మందులు చల్లడం, కలుపు తీయడం వంటి పనులు ఉండవు. దీంతో రైతులకు ఖర్చులు కలిసి వస్తున్నాయి. మల్చింగ్ విధానంలో హెక్టారుకు రూ.35 వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వం హెక్టారుకు రూ.16 వేలు సబ్సిడి కింద అందిస్తుంది. ఈ విధానంలో విత్తనాలు విత్తిన నాటి నుంచి పంట పూర్తయ్యే వరకు ఎలాంటి కలుపు నివారణ పనులు చేయనక్కరలేదు. రైతులు సాధారణంగా పండించే పంటలకన్నా ఈ విధానంలో 30 శాతం అధిక దిగుబడులు పొందవచ్చు. మల్చింగ్ విధానంలో 25 మైక్రాన్లు, 50 మైక్రాన్లు, 60 మైక్రాన్లు, 75 మైక్రాన్లు, 100 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ షీట్లను మొక్కల బోదెలపై కప్పి ఉంచుతారు.

పండ్ల తోటలకు 75 నుంచి 100 మైక్రాన్లు, పూలు ఇతర స్వల్పకాలిక పంటలకు 25 మైక్రాన్లు, 30 మైక్రాన్లు, 50 మైక్రాన్ల మందం ఉన్న షీట్లను వాడతారు. పొలంలో ప్రతి మల్చింగ్ కవర్‌కు నాలుగు అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. డ్రిప్ ద్వారా మొక్కకు నీరు అందేలా కవర్‌కు చిన్న రంధ్రం ఏర్పాటు చేయాలి. విత్తనానికి, విత్తనానికి మధ్య 60 సెంటీమీటర్లు ఉండేలా విత్తుకోవాలి. ఒకసారి మల్చింగ్ కవర్ ఏర్పాటు చేసుకుంటే మూడు సార్లు అదే ప్రదేశంలో విత్తనాలు విత్తుకోవచ్చు. సంప్రదాయ పద్ధతితో పోల్చుకుంటే మల్చింగ్ షీట్ పరిచిన పొలంలో ఎరువులను మొక్కలు పూర్తిగా వినియోగించుకుంటాయి.

చీడపీడల నుంచి రక్షణ

ఈ విధానంలో కలుపు వచ్చే అవకాశాలు లేక పోవడంతో చీడ, పీడల నుంచి కూడ బెడద ఉండదు. అంతే కాక నీటి వినియోగం బాగా తగ్గుతుంది. పుచ్చ, బొప్పాయి, టమోట, మిర్చి, జామ, కూరగాయల పంటలు మల్చింగ్ విధానంలో రైతులు పండిస్తున్నారు. ఏలూరు జిల్లాలో సుమారు 1.20 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు విస్తరించి ఉన్నాయి. మల్చింగ్ విధానం సక్సెస్‌ఫుల్‌గా ఉండటంతో జిల్లాలో సుమారు 1,600 ఎకరాలకు పైగా రైతులు మల్చింగ్ విధానం ద్వారా సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

రైతులకు లాభం



మల్చింగ్ విధానం ద్వారా సాగు రైతులు ఇప్పుడిప్పుడే అవలంభిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. అధిక దిగుబడులతో లాభాలు గడిస్తున్నారు. మల్చింగ్ విధానంలో ప్లాస్టిక్ షీట్లు వినియోగించే రైతులకు ఉద్యాన శాఖ హెక్టారుకు రూ.16 వేలు అందిస్తుంది. వచ్చే ఐదేళ్లలో అన్ని ఉద్యాన పంటల సాగుల్లో మల్చింగ్ విధానం ప్రాధాన్యత పెరుగుతుంది. రైతులకు మరింత అవగాహన కలిగించడానికి ఉద్యాన శాఖ కృషి చేస్తుంది. మల్చింగ్‌పై సమాచారం కావల్సిన రైతులు ఉద్యాన అధికారులను సంప్రదించాలి. **అడపా దుర్గేష్- ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్**

12లోగా ఇంటర్ సర్టిఫికెట్లు అందజేయాలి



ఇంటర్ పాస్ సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్స్‌కు అందచేస్తున్న జిల్లా వృత్తి విద్యాధికారి ప్రభాకరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ పాసైన విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్లను ఈ నెల 12లోపు విద్యార్థులకు గానీ, వారి తల్లిదండ్రులకు గానీ అందచేయాలని జిల్లా వృత్తి విద్యాధికారి బీ.ప్రభాకర రావు ఆదేశించారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేసే కార్యక్రమాన్ని ఆదివారం ఏలూరు వృత్తి విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌తో సహా అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాల్స్‌కు వారి విద్యా సంస్థల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల పాస్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర రావు మాట్లాడుతూ 2014 నుంచి 2023 వరకూ ఉత్తీర్ణులైన విద్యార్థుల సర్టిఫికెట్లు డిజిలాకర్ సిస్టంలో భద్రపరిచామని, వాటిని ఓపెన్ చేసి వారికి డిజిటల్ సర్టిఫికెట్లను ఇచ్చామన్నారు. డిజిలాకర్ సిస్టం ద్వారా సర్టిఫికెట్లు పొందే విధానం వివరంగా తెలపాలని ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కార్యక్రమంలో పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వర రావు, పీడీబీటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ సూర్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పేర్రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీవీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



రామాలయం పునర్నిర్మాణానికి చెక్కు అందజేస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

చింతలపూడి: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని ప్రగడవరం బీసీ కాలనీలో నిర్మిస్తున్న కోదండ రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా దేవాదాయ శాఖ మంజూరు చేసిన 5 లక్షల రూపాయల చెక్కును ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి ఆలయ నిర్వాహకులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో శిథిలదేవాలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. తనకు గత పార్లమెంట్ ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గంలోని ప్రగడవరం పంచాయితీలో అత్యధిక మెజార్టీ వచ్చిందని వచ్చే ఎన్నికల్లో కూడ వైఎస్సార్‌సీపీ బలపరిచి మెజారిటీని రెట్టింపు చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు గ్రామస్తులు వారి సమస్యలను ఎంపీ కోటగిరి దృష్టికి తీసుకు వెళ్ళారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం. నీరజ, కామవరపుకోట జెడ్పీటీసీ కడిమి రమేష్ పాల్గొన్నారు.

చేపల చెరువులో పడి యువకుడి మృతి

ఉంగుటూరు: కైకరం ఆయకట్టులో చేపల చెరువులో మేత వేస్తున్న బోటు ప్రమాదవశాత్తు తిరగబడి బది రెడ్డి నాగరాజు(30) మృతి చెందాడు. కోనా హనుమాన్ బాబాకు చెందిన రైతు చెరువులో మేత పనికి నాగరాజు వెళ్లాడు. పడవ తిరగబడడంతో అతనిని బయటకు తీసి తాడేపల్లిగూడెం తరలిస్తుండగా చనిపోయినట్లు వీఆర్వో శ్రీనివాసు తెలిపారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం సోమవారం నిర్వహిస్తారని వీఆర్వో తెలిపారు.

వైభవంగా బలుసులమ్మ నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వాన శుభ పత్రికను ఆవిష్కరిస్తున్న కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు, గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి తప్పక ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలో మంత్రి నివాసం వద్ద ఆదివారం బలుసులమ్మ అమ్మవారి దేవీ నవరాత్రుల మహోత్సవాలు ఆహ్వాన శుభ పత్రిక, ఆలయ చరిత్ర పుస్తకాన్ని మంత్రి చేతుల మీదుగా ఉత్సవ కమిటీ విడుదల చేసింది. క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి దేవస్థానం చైర్మన్ కొట్టు రామాంజనేయులు (అంజిబాబు) ఆధ్వర్యం వహించారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ బలుసులమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 23 వరకు వైభవోపేతంగా జరుగుతాయని తెలిపారు. సామూహిక సరస్వతీ పూజ, కుంకుమ పూజలు జరుగుతాయని వెల్లడించారు. గత ఏడాది అమ్మవారికి వెండి కవచం చేయించామని.. ఈ ఏడాది వెండి వాకిలి, వెండి పీఠంతో కూడిన రథం, వెండి ఊయల వంటివి సమకూర్చుతామన్నారు. అమ్మవారి తెప్పోత్సవానికి ప్రత్యేకంగా ఆలయ ప్రాంగణంలోనే పుష్కరిణి నిర్మించామని వెల్లడించారు. ఆలయ కమిటీ చేస్తున్న కృషిని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజు భక్తులకు అమ్మవారి విశేష అలంకరణ, ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రవచన మండపం, స్ట్రాంగ్ రూం, అమ్మవారి నైవేద్యం తయారు చేసేందుకు ప్రత్యేక వంటశాల, యాగశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. సభ్యులు కర్రి భాస్కరరావు, గుండుబోగుల నాగు, వట్టిపోలు రాము, పెదప్రోలు భాస్కర్, అప్పన రమేష్, నున్న రంగనాయకులు, వెలనాటి సత్తిబాబు, గుంటుబోయిన స్వామి, గార్లపాటి వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కాలేజీలు విధివిధానాలు పాటించాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న విద్యా సంచాలకుడు చంద్రశేఖర్‌బాబు

తణుకు అర్బన్: ఇంటర్ విద్యావిధానంలో ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికలను ప్రైవేటు విద్యాసంస్థలు తూచాతప్పకుండా పాటించాలని ఉమ్మడి జిల్లాల ఇంటర్మీడియేట్ విద్యా సంచాలకులు కోరుకొండ చంద్రశేఖర్ బాబు అన్నారు. తణుకు గమిని ఫంక్షన్ హాలులో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ జూనియర్ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీజేఎంఏ) ఆధ్వర్యంలో సభాధ్యక్షుడు గంధం సాంబశివరావు ఆధ్వర్యంలో ఉమ్మడి గోదావరి జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ.. విద్యాశాఖ సూచనల మేరకు 5 నుంచి 18 సంవత్సరాల వయసున్న పిల్లలందరూ పాఠశాలలు, కళాశాలల్లోనే ఉండేలా ప్రైవేటు విద్యాసంస్థలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రైవేటు యాజమాన్యాలన్నీ నూరు శాతం విద్యార్థుల ఉత్తీర్ణతకు పాటుపడాలని, ఫెయిలైన విద్యార్థులతో సప్లిమెంటరీకి ఫీజులు కట్టించాలని సూచించారు. ఏపీజేఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్సార్ ఆంజనేయులు (ప్రగతి రాజా) మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాలన్నీ పాటిస్తున్నామని స్పష్టం చేశారు. అసోసియేషన్ సభ్యులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి జి.బ్రహ్మాజీ, సీనియర్ సభ్యులు ఎస్.భాస్కరరామయ్య, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ, జి.సత్యనారాయణ, వివిధ కళాశాలల సెక్రటరీలు, కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు. ఏపీజేఎంఏ నూతన అసోసియేషన్ అధ్యక్షుడిగా ఘంటసాల బ్రహ్మాజీ, కార్యదర్శిగా వీవీఎస్ స్వామి, కోశాధికారిగా జి.అవినాష్ సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా నాగబాబు, సహాయ కార్యదర్శిగా మోడ్రన్ చంటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ చిడే సత్యనారాయణ, స్టేట్ కోఆర్డినేటర్ ప్రభాకర్, శశి మేకా నరేంద్ర, జి. సత్యనారాయణ, అన్నపూర్ణ భాస్కరరామ్, 56 కళాశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్త నదీ జలాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లు

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి సప్తనదీ జలాభిషేకాలు, పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఈవో మోకా అరుణ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి స్వామికి సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు జరపనున్నట్లు స్పష్టం చేశారు. గోదావరి, సరస్వతి, యమునా, గంగా, కృష్ణ, కావేరి, నర్మదా నదుల నుంచి సేకరించిన జలాలతో స్వామికి అభిషేకం చేస్తామన్నారు. 9వ తేదీ నుంచి స్వామికి విశ్వక్సేన పూజ, దీక్షాధారణ, అంకురార్పణ, యాగశాలర్చన, హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ శనివారం స్వామికి హోమాలు ప్రధానార్చకులు వేదమంత్రాల నడుమ పవిత్ర విసర్జన, సప్త నదీ జలాల అభిషేకాలతో పాటు శాంతి కల్యాణాలు నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశానికి హాజరైన ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం రీజినల్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు చర్చించారు. తమ సమస్యలను ముఖ్య అతిథిగా హాజరైన డిస్కం సెక్రటరీ పీకేవీఎం లక్ష్మీరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. ఉద్యోగుల సమస్యలను డిస్కంల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్పోర్ట్స్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యుత్ ఉద్యోగులు అన్సర్ అలీ, మాధవ్‌ను శ్రీనివాసరావు సత్కరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.హరిబాబు, ఎం.శ్రీనివాసరావు, జోన్–2 బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, పి.త్రిమూర్తులు, స్టేట్ కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు



సీనియర్ మహిళల జట్టు

ఏలూరు రూరల్: ఈ నెల 14 నుంచి 16 వరకూ కడపలో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల హ్యాండ్ బాల్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.అలివేలు చెప్పారు. ఆదివారం ఏలూరులోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆవరణలో ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు వై.లక్ష్మీనారాయణ, పీడీ ఎల్వీ ప్రసన్న, ఎం.సుబ్బారావు, కోచ్ ఉదయకిరణ్ జట్టు ఎంపిక చేపట్టారు.

సీనియర్ మహిళల జట్టులో: డి.స్వాతి, డి.రాఖీ, సీహెచ్ దుర్గారాణి, కె.ఉమామహేశ్వరి, ఎస్.జోస్మి తన్మయి, ఏవీ శ్రావణకుమారి, జి.పుణ్య, కె.వనజ, పి.మౌనిక, పి.వల్లిక, జి.ప్రవల్లికసత్య, సారిక, ఎం.సాత్విక, ఆర్.సౌమ్యశ్రీ,

బాలుర జట్టులో: ఏ శ్రీరామ్, డి.ప్రశాంత్, కె.ప్రభుదేవా, జి.పవన్‌కుమార్, ఏ.సుభాని, సీహెచ్ చందు, సీహెచ్ మోహన్, ఆర్.ఈశ్వరరావు, ఎస్.వెంకటసాయి, జి.జితేంద్ర, పీ నాగఅవినాష్, ఎం.ధన గణేష్, ఐ.సంజయ్, ఆర్.కార్తిక్ ఎంపికయ్యారని వెల్లడించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పోడూరు: మండలంలోని గుమ్మలూరు గ్రామంలో ఆదివారం కోడిపందాల స్థావరంపై స్థానిక ఎస్సై డి.రామ్‌కుమార్ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడి కోడిపందాలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.650 నగదు, 2 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

టీడీపీ నేత అశోక్‌పై కేసు నమోదు

దెందులూరు: టీడీపీ నేత చలమోలు అశోక్‌పై భీమడోలు కోర్టు ఆదేశాల మేరకు దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెలలో సీఐడీ పోలీసులు చంద్రబాబు అరెస్టు అనంతరం 21న దెందులూరులో టీడీపీ శ్రేణులు నిరసన దీక్షలు చేశాయని, ఆ శిబిరాల్లో టీడీపీ నేత చలమోలు అశోక్ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాద్‌ను అవమానపరిచేలా దుర్భాషలాడారన్నారు. ఈ నెల 6న గంటా ప్రసాద్ దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదుపై భీమడోలు కోర్టు చలమోలు అశోక్‌పై కేసు నమోదు చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

వినోద్‌కుమార్ కేసులో శివశంకర్‌కు రిమాండ్

దెందులూరు: మద్దుల వినోద్‌కుమార్ ఆత్మహత్య కేసులో ఆయన బావమరిది బుగత శివశంకర్‌కు భీమడోలు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. దెందులూరు మండలం పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన మద్దుల వినోద్‌కుమార్ ప్రైవేటు కంపెనీలో రికార్డు ఏజెంటుగా పనిచేసేవాడు. 2023 ఆగస్టు 23వ తేదిన మనస్తాపంతో సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులు దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ నిర్వహించి ఏ1గా భార్య మద్దుల పుష్ప, ఏ2గా బుగత శివశంకర్, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

జూనియర్ బాలుర ఖోఖో జట్ల ఎంపిక



లింగపాలెం మండలం కె.గోకవరం హైస్కూల్‌లో ఎంపిక చేసిన ఖోఖో బాలుర జట్టు

లింగపాలెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం లింగపాలెం మండలం కె.గోకవరం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర ఖో–ఖో జట్లను ఎంపికచేసినట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కార్యదర్శి రంగారావు విలేఖర్లకు తెలిపారు. అండర్–18 విభాగానికి సంబంధించి జూనియర్ బాలుర ఖో–ఖో జట్ల ఎంపికకు జిల్లాలోని పలుగ్రామాలకు చెందిన 70 మంది క్రీడాకారులు హజరైనట్లు తెలిపారు. వీరికి పోటీలు నిర్వహించి జట్టుకు 15 మంది క్రీడాకారుల్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20 నుంచి 22 వరకు చిత్తూరులో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి ఈ జట్టు పాల్గొంటుందన్నారు. క్రీడాకారులను పీడీలు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసరావు, ఆదినారాయణ, సత్యన్నారాయణ అభినందించారు.

దాడి చేసిన నలుగురిపై కేసు

పోడూరు: గుమ్మలూరులో భార్యాభర్తలపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుమ్మలూరుక చెందిన యండమూరి మంగ, వెంకట్రావు దంపతులపై సరిహద్దు గొడవల నేపథ్యంలో అడ్డాల శివ, శివన్నారాయణతో పాటు మరో ఇద్దరు శనివారం రాత్రి ఇంటి గోడ దూకి భార్యభర్తలపై దాడి చేసి గాయపర్చారు. దీంతో బాధితులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు.

క్లుప్తంగా

72 మందికి కంటి పరీక్షలు



లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఆదివారం కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వైద్య బృందంతో 72 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్ల నిమిత్తం 11 మందిని ఆసుపత్రికి పంపారు. 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. శిబిరాన్ని డాక్టర్ ఎం.రాజీపాల్ ప్రారంభించారు. లయన్స్ సర్వీస్ డే సందర్భంగా పేద కుటుంబానికి కిరాణా సరుకులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ త్వరలో ఉచిత డయాబెటీస్ క్యాంప్ నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తామని వెల్లడించారు. కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

సంచార వైద్యశాల ద్వారా 10 మందికి వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో బాగంగా ఆదివారం 10 వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో తణుకు పట్టణం, పైడిపర్రు, పాలంగి గ్రామాల్లో పర్యటించారని తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు కర్రి లక్ష్మణ్‌రెడ్డి ఆర్థి సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ట్రాఫిక్ ఎస్సై వి.సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెల్మెట్ ధరించడంతో సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని ట్రాఫిక్ ఎస్సై వి.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల తమ ప్రాణాలు కోల్పోతున్నారని, అందరూ తప్పక హెల్మెట్ ధరించాలని కోరారు.

కేదారీ ఘాట్ ప్రక్షాళన



సిద్ధాంతం కేదారీ ఘాట్ శ్మశాన వాటిక పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలోని సుప్రసిద్ధకేదారీ ఘాట్ శ్మశాన వాటిక దాత సహకారంతో ఆదివారం ప్రక్షాళన చేశారు. చెత్తా చెదారాలతో నిండిపోవడంతో ఇటీవల దహన క్రియలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి సైతం దక్షిణ కాశీగా పేరు గాంచిన వశిష్టా తీరంలో కేదారీ ఘాట్‌లో దహన సంస్కారాలు చేస్తుంటారు. దీంతో సిద్ధాంతం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మండవల్లి హరిప్రసాద్ సహకారంతో ఆదివారం చెత్తా చెదారాలు తొలగించి ప్రక్షాళన చేశారు. దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా శుభ్రపరిచారు. కార్యక్రమంలో కొరు వెంకటేశ్వర్లు, ఊటాల వెంకటేశ్వర్లు, ఊటాల వెంకన్న, కర్రి రాంబాబు, గెద్దన పల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామికి సామూహిక పూజలు



కొఠాలపర్రులో కేశవ స్వామికి దివ్య ప్రబంధ పారాయణ చేస్తున్న వైష్ణవులు

పెనుగొండ: రెండవ శ్రీరంగంగా పేరుగాంచిన కొఠాలపర్రులోని కేశవ స్వామి ఆలయంలో ఆదివారం అండమాన్, రాజమహేంద్ర వరం నుంచి వచ్చిన భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. స్థానాచార్యులు ముడుంబై రామానుజాచార్యులు, ఆలయ అర్చకులు ఎస్ వెంకటాచార్యులు ఆధ్వర్యంలో కేశవ స్వామికి నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మరంగంటి కృష్ణమాచార్యులు, గొడవర్తి వెంకట మురళీ, ముడుంబై నరసింహాచార్యులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనకు మెండుగా ప్రజాశీస్సులు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- విప్పర్రు వడ్డిగూడెంకు వరాలు



వడ్డిగూడెంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: సీఎం జగనన్న పాలనకు ప్రజాశీస్సులు మెండుగా ఉన్నాయని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం అర్ధరాత్రి విప్పర్రు గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన గ్రామ శివారు వడ్డిగూడెంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా పడమర విప్పర్రులోని వడ్డిగూడెం అభివృద్ధికి వరాలు కురిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రభుత్వంలోనే పేదలకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగనన్నను ప్రతీ ఒక్కరూ ఆదరించాలన్నారు. గ్రామస్తులను మంత్రి ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు స్థానికులు విన్నవించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతీ ఒక్కరూ పార్టీకి విధేయులై జగనన్న నాయకత్వాన్ని బలరపరచాలని కోరారు పడమర విప్పర్రు ప్రధాన రోడ్డు నుంచి తాగునీటి కోసం వాటర్ పైప్‌లైన్, పెద ఎస్సీపేట నుంచి వడ్డిగూడెంకు కిలోమీటర్ మేర రహదారి నిర్మాణం, వడ్డిగూడెం శ్మశానానికి వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డు, పేటలో మరో సిమెంట్ రోడ్డు వేసేందుకు మంత్రి సుముఖత వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు కోసూరి వెంకట్రాజు, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోణం వీరయ్య, ఎంపీటీసీ సభ్యురాలు యండ సరస్వతి, సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి నాగేశ్వరరావు, కోసూరి సుబ్బరాజు, తెంటు గోపి, కళిరెడ్డి నాగేంద్ర భూపాల్, వడ్డిగూడెం పార్టీ యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక వడ్డిగూడెంకు చెందిన పార్టీ నాయకుడు గణసల నాగరాజు ఆధ్వర్యంలో తమ పేటకు వరాల జల్లు కురిపించిన మంత్రి కొట్టు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, మాజీ సర్పంచ్‌లు పసల చంటి,డోకల నాగేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



డైమండ్స్ ఆధ్వర్యంలో మహిళలకు దుస్తులు అందజేస్తున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ సర్వీస్ డే కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో ఆదివారం పలు ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, రైస్ బ్యాగులు, నిత్యావసర వస్తువులు అందించారు. పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కొప్పిశెట్టి రమణయ్య, కాళ్ళ గోపికృష్ణ, ఆకుల సుబ్రహ్మణ్యం, వీరభద్రరాజు, వెంకటేశ్వరరావు, సత్యదేవ్, సుశీల, అంబికా, దివ్య, మాధురి, ప్రజ్ఞ, అమృత పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన విభిన్న ప్రతిభావంతులు



ప్రశంసా పత్రాలతో విభిన్న ప్రతిభావంతులు



క్రీడలలో ప్రతిభ చూపుతున్న దివ్యాంగ విద్యార్థి

పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ స్కూల్లో హైస్కూలు విద్య చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనపరిచారు. ఆ వివరాలను స్కూలు ప్రత్యేక విలీన విద్యా ఉపాధ్యాయిని సాయి స్వరూప వెల్లడించారు. భీమవరంలో చింతపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. వారిలో పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూలుకు చెందిన 10 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. వీరిలో ముగ్గురికి స్వర్ణ పతకాలు, మరో ఏడుగురికి కాంస్య పతకాలు వరించాయి. వారికి జిల్లా సమగ్ర శిక్షణ జిల్లా అధికారులు, స్థానిక డీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం చేతుల మీదుగా బహుమతులు పొందారు. ప్రత్యేక విద్యలో పాఠశాల సహాయకురాలిగా పనిచేస్తున్న సాయి స్వరూప వారి స్థాయి వైకల్యాన్ని అనుసరించి తగిన శిక్షణను అందించినందుకు మండల విద్యాశాఖాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌తో పాటు, ప్రధానోపాధ్యాయుడు రాజేష్ ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో భీమవరంలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీల్లో తాడేపల్లిగూడెం దివ్యాంగ విద్యార్థులు ప్రతిభ చూపారు. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య మాట్లాడుతూ పరుగు పందెంలో వై.పాండురంగడు ప్రథమస్థానం, షార్ట్‌పుట్, త్రోబాల్ ఆటలో ఎమ్.ఎస్.సుందరం ప్రథమస్థానం, షార్ట్‌పుట్‌లో ఎస్కే చాందిని ప్రథమస్థానం, స్టాండింగ్ జంప్‌లో సాయితేజ తృతీయ బహుమతి గెలుపొందినట్లు చెప్పారు. సమగ్ర శిక్ష విలీన విద్య సమన్వకర్త సుబ్రహ్మణ్యం, సహాయ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రభాకర్, ఉప విద్యాశాఖాధికారి శ్రీరామ్ దివ్యాంగులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. భవిత విద్యార్థులను పలువురు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు అండ



అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉండి ఇంటి నిర్మాణానికి సహాయం అందజేస్తానని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీనిచ్చారు. బూరుగుపల్లి పంచాయతీ మట్టవానిచెరువులో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో యాతం రాంబాబు, యాతం నరసింహారావులకు చెందిన తాటాకిళ్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. బాధితులను ఆదివారం గోపి పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధితులకు బియ్యం అందజేశారు. బాధితులకు ఇళ్ల స్థలం మంజూరు చేయించి, ఇల్లు కూడా ఇస్తామని చెప్పారు. ఇంటి నిర్మాణానికి తన వంతు సహాయంగా చెరో రూ.20 వేలు ఇస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బాధితులు గోపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు వైఎస్సార్ సీపీ నాయకులు బోనం బులివెంకన్న, దేవరపు మల్లేశ్వరరావు, పెంటపాటి నూకరాజు, కడలి ఏడుకొండలు, ఆకుల సూర్యనారాయణ, సీహెచ్ శ్రీనివాస్, చెరుకూరి శ్రీరామమూర్తి, మామిడిశెట్టి చిన్నిబాబు, గోనిపాటి బాబూరావు, దొమ్మేటి శ్రీను, యాతం వెంకటేశ్వరరావు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ఐక్యతకు చిహ్నాలు

పాలకొల్లు అర్బన్: ఉత్సవాలు యువజనుల మధ్య ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పట్టణంలోని అల్లు వెంకట సత్యనారాయణ కాలనీలో ఉన్న న్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్న సమారాధనను గుడాల గోపి ప్రారంభించి మాట్లాడారు. అలాగే ఆలయంలో లడ్డుపాట నిర్వహించగా రూ.28 వేలుకి వైఎస్సార్ సీపీ నాయకుడు మండెల ప్రసాద్ పాడుకున్నారు. ఉత్సవ కమిటీ టి.దుర్గాప్రసాద్, కందులపాటి మోహన చలపతి రావు, ఎస్ సత్యనారాయణ (బాబి), వైఎస్సార్ సీపీ నాయకులు రావి నాగేశ్వరరావు, కాంట్రేకుల రాజేశ్వరి, జోగి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రామకృష్ణ, జోగాడ ఉమామహేశ్వరరావు, కొండేటి రవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



పోడూరు ఎస్సై డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు

పోడూరు: తనపై ఫేస్‌బుక్‌లో తప్పుడు పోస్టులు పెట్టి తన ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా, కుల విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కుట్రలు పన్నుతున్న టీడీపీ కోవర్టులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన పార్టీ నాయకులతో కలసి ఆదివారం ఆయన స్థానిక ఎస్సై డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదును అందజేశారు. ఈ నెల 7న పాలకొల్లు పట్టణానికి చెందిన టీడీపీ కోవర్టు బుంగ తిరుమలరాజు తాను దళితులను దూషించినట్లుగా లేనిపోని అపనిందలతో ఫేస్‌బుక్ పోస్టు పెట్టినట్లు పెద్దిరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే జిన్నూరు గ్రామానికి చెందిన గిలిగి గోపాలకృష్ణ, పాలమూరుకు చెందిన బుంగ పవన్‌లు తిరుమల రాజుకు సహకరించి తనను కించపర్చి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేవిధంగా కుట్రపన్నుతున్నారని పెద్దిరాజు ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. వారు ముగ్గురుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కఠినంగా శిక్షించాలి..

పోడూరు జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేత అయిన గుంటూరి పెద్దిరాజుపై లేనిపోని అపనిందలతో ఫేస్‌బుక్ పోస్టులు పెట్టి విద్వేషాలను రెచ్చగొట్టాలను కుట్రలు పన్నుతున్న టీడీపీ కోవర్టులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించేలా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న పోలీసులను డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు పెద్దిరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చిన అనంతరం నాగన్న మాట్లాడుతూ పోడూరు మండలంతో పాటు ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో జెడ్పీటీసీ పెద్దిరాజు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి కలిదిండి గణపతిరాజు, జేసీఎస్ కన్వీనర్లు బళ్ల రాజశేఖర్, పైడి ఏసుబాబు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరరావు, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, జిన్నూరు, పెనుమదం సొసైటీ చైర్మన్‌లు డీటీడీసీ బాబు, కొత్రపాటి వీరాస్వామి, దిద్దే శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చుట్టుగుల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో బీసీలకు ప్రాధాన్యత



బీసీ సంఘం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘ నాయకులు

కాళ్ల: బీసీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక స్థానం కల్పించారని బీసీ సంఘ జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, నియోజవర్గ అధ్యక్షులు మన్నే నాగరాజు అన్నారు. కోపల్లెలో ఆదివారం బీసీ సంఘ ఆత్మీయ సమావేశం బీసీ సంఘం మండల అధ్యక్షులు పాట్లూరి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వెంకటాచార్యులు, నాగరాజు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండాలని బీసీలకు ప్రత్యేక స్థానం ఇచ్చిన ప్రభుత్వాలకు అండగా నిలవాలని సూచించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు సీఎం వైఎస్ జగన్ పెద్దపేట వేశారన్నారు. నియోజకవర్గంలో పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో బీసీలకు ప్రత్యేక స్థానం ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు. బీసీలంతా సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. బీసీల కులగణన జరగాలని కోరారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా బీసీలంతా లబ్ధి పొందాలని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఐక్యంగా ఉండి హక్కులు సాధించేందుకు ముందుండాలన్నారు. ఈ సమావేశంలో నూతన మండల కమిటీని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వీరమల్లు బోసు, మన్నె శ్రీనివాస్, కందుల హనుమ, ఆకివీడు, పాలకోడేరు, ఉండి, మండలాల కన్వీనర్లు నున్న గణపతి, బొక్కా రాంబాబు, అంగర రాంబాబు గులిపల్లి ధనుంజయ్, లంక భవాని, ముంజేటి రామకృష్ణ, కాపా రాజశేఖర్, బీసీ సంఘం జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెనుగొండలో నిమజ్జనోత్సవాల సందడి



పెనుగొండలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న వేషధారణలు

పెనుగొండ: ప్రతీ ఏటా పెనుగొండ కంబాల వారి వీధి, జవ్వాదివారి వీధిల్లో నిర్వహించే భారీ స్థాయి గణేపణినిమజ్జనోత్సవం ఆదివారం కనుల పండుగగా నిర్వహించారు. కంబాల వారి వీధిలోనూ, జవ్వాదివారి వీధిలోనూ, వినాయకుని ఆలయం వద్ద గణపతి ప్రతిమలను ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యద్భుతంగా ఏర్పాటు చేసిన ఎలుక వాహనంపై ఉంచి నిమజ్జనోత్సవం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేరళవాయిద్యాలు, డీజే వాయిద్యం, ఫుల్ బ్యాండులతో హోరెత్తించారు. ట్రాక్టర్లపై ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి, పెనుగొండ, చెరుకువాడల్లో బాణసంచాకాల్పులతో ఊర్రూతలూగించారు. అనంతరం నరసాపురం కాలువలో నిమజ్జనం నిర్వహించారు. ఆదివారం కావడంతో పరిసర గ్రామాల నుంచి ఉత్సవాన్ని తిలకించడానికి భారీగా ప్రజలు తరలివచ్చారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి



సుంకర సీతారామ్

పెనుగొండ: అధికారం దక్కదనే అక్కసుతో నైతిక విలువలకు తిలోదకాలిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఆచంట మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.సీఎం జగన్ ప్రజారంజక పాలనను ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేని యెల్లో మీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలన్నారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేస్తున్న అభివృద్ధి పనులతో ఆచంటలో విజయం ఖాయమన్నారు.

ఎస్టీవీఎన్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గూడెం మూన్‌లైట్ కన్వెన్షన్ హాల్లో కలిసిన ఎస్టీవీఎన్ పూర్వ విద్యార్థులు

పెంటపాడు: స్థానిక ఎస్టీవీఎన్ హిందూ హైస్కూల్లో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం గూడెంలోని మూన్‌లైట్ కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు రకాల ఆటపాటలతో కుటుంబాలతో ఉత్సాహంగా గడిపిన పూర్వ విద్యార్థులు అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. బాల్య స్నేహితులను ఆత్మీయంగా పలకరించి, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొ న్నారు. పెంటపాడు, గూడెం , హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో పలు వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన స్నేహబృందం సభ్యులున్నారు.

నీతిని బోధించే సినిమాలు కరువయ్యాయి



సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సినీ దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: సమాజానికి నీతిని బోధించే సినిమాలు కరువయ్యాయని ప్రముఖ సినీ దర్శకుడు సి ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన కదలిక ప్రగతిశీల ఆలోచనల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. 1930లో వచ్చిన సినిమాలు మాలపిల్ల, రైతు బిడ్డ సినిమాలు సమాజానికి మంచి సందేశాన్ని అందించాయన్నారు. ప్రస్తుత సినిమా రంగం వ్యాపార ధోరణితో చిత్రీకరిస్తున్నారే తప్ప సమాజానికి మంచి బోధించే అంశాలు ప్రస్తుత సినిమాల్లో ఉండడం లేదన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సినిమా రంగాన్ని శాసిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి, కదలిక వ్యవస్థాపక అధ్యక్షుడు పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, సీపీఎం సీనియర్ నాయకుడు వలవల శ్రీరామమూర్తి, డా.కేఎస్‌పీఎస్ వర్మ, లయన్స్‌క్లబ్ మహిళా అధ్యక్షురాలు అరుణానాయుడు, ఏకేవీ రామభద్రం, రామలక్ష్మణరావు, మాడభూషి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ధ్యానంపై శిక్షణ

వీరవాసరం: వీరవాసరంలో శ్రీసీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ ఆదివారం నిర్వహించారు. విజయవాడకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎస్.రామారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయాలని, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలని, ధ్యానం సర్వరోగ నివారణి, ధ్యానం సర్వభోగకారిణి, ధ్యానం సత్యజ్ఞానప్రసాదిని అన్నారు. ప్రతిఒక్కరూ ధ్యానసాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, ఎం.కృష్ణారావు సన్నిధి ఉదయ్, కె.మోహన్, వర్రె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అడవి బాపిరాజుకు నివాళి

భీమవరం (ప్రకాశం చౌక్): స్వాతంత్ర్య సమరయోధులు, రచయిత అడవి బాపిరాజు జయంతి కార్యక్రమాన్ని జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో పట్టణంలోని క్విట్ ఇండియా స్థూపం వద్ద ఆదివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ నూతన భవన ప్రాంగణంలో నిర్మించే పార్క్‌కు బాపిరాజు పేరుతో నామకరణం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణను సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి కోరారు. దీనిపై రమణ మాట్లాడుతూ బాపిరాజు రచనలు పాఠకుల హృదయాల్లో నిలిచిపోయాయని, ఆయన పేరిట తప్పకుండా అసోసియేషన్ భవన ప్రాంగణంలో పార్కుకు నామకరణం చేస్తామన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్కే చాన్ పాషా, వారణాసి రాధాకృష్ణ, పి.అమూల్యరావు, పి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.